# సంహిత-1

వేద ప్రథమ భాగములకు సంహితలని పేరు. ఋగ్వేద సంహిత, యజుర్వేద సంహిత, సామవేద సంహిత, అథర్వణవేద సంహిత - నాలుగు వేదములకు నాలుగు ప్రత్యేకమయిన సంహితలున్నవి. సంహితా వ్యాఖ్యానములే తక్కిన మూడు భాగములైన బ్రాహ్మణ, ఆరణ్యక ఉపనిషత్తులు.

బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులు సంహితను గురించి మనముఆలోచన సేయునప్పుడు సహాయకారులు గాని, సంహితలోని ఋక్కులకు, యజస్సులకు అర్థము చెప్పునవి కావు. మన ఆలోచనలకు, మన తపస్సునకు దోహదములు. బ్రాహ్మణారణ్య-కోపనిషత్తులు లేనిచో, సంహితను గూర్చి తపస్సు చేయుటయే కుదరదు. మనస్సునకు ఏ దారిని పోవలయునో కూడ తెలియదు. బ్రాహ్మణములు దారుల పేర్లు చెప్పవచ్చును. ఆరణ్యకము దారిలో అచ్చటచ్చట తగులు గుర్తులు చెప్పవచ్చును. ఉపనిషత్తు దారిచివరనున్న సౌధములను వర్ణింపవచ్చును. కాని, ఇందలి ఏ ఒక్క భాగముగాని, ఆ దారి పొడవెంత? ప్రయాణమెన్ని రోజులు? దారిలో నున్న కష్టములేమి, సుఖములేమి? ఈ ప్రశ్నలను గురించి మాటాడదు. ఎందుకు మాటాడదు? ఆ దారి, ఎవరికి వారికి ప్రత్యేకమయినది కనుక. అనగా, ఆ దారిలోని సాధక, బాధకములు అందరకు ఒక్క మాదిరిగా నుండవు. ఏజీవికాజీవి ప్రయత్నములు, ఫలితములు వేరుగా నుండును. అనగా సంహితలోని మన్త్రములు ఎవంకి వారు ఆలోచన చేసి, (తపస్సు చేసి) వారివారి అనుభూతులను (experience) పొంది, ఆయా జ్ఞానసిద్ధులను (realization) పొందవలెను.

కాని సంహితా తపస్సు నారంభించుటకు, సంహితా స్వరూపము కొంతైనను తెలియవలెను గదా! కనుక సంహితయనగా ఏమిటి, అని విచారించవలెను. సంహిత యనగా సంస్కృతమునందు -సమిష్టి స్వరూపము; కలిసినది; కూడినది అని అర్థము. నాలుగైదు విషయములుకలసి ఉన్నచో అది సంహిత. వేదభాష అక్షర ప్రధానమైన భాష కనుక, వేదమునందు సంహితా శబ్దమున కర్థము తెలియవలెనన్నచో అందలి ప్రత్యక్షరమును చూడవలెను.

"స-మ్-హి-త" లో సకార, మకార, హకార, తకారములున్నవి. వేదభాషలో "స శ ష హ" అక్షరములు ప్రాణమునకు సంబంధించినవి. వాటిని పలుకుటకు గాలి (ప్రాణము) కొంచెము ఎక్కువ కావలెను. కనుక ఎక్కువ ప్రాణసంబంధము కలిగినవి. అందువలన వేదము వీనిని ప్రాణ విషయకముగా వాడును.

సకారము సకల ప్రాణ శక్తికి సంబంధించినది. హకారము ప్రత్యేకమయిన జీవిలో నున్న ప్రాణము. ఎవరి ప్రాణము వారికి "హ". స్వాహా - ఏ దేవతా శక్తిని గురించి నేనిప్పుడు భావించుచున్నానో, ఆ దేవతా ప్రాణశక్తి "స", వాక్కు "వా" ద్వారా నా ప్రాణశక్తిని "హా" జేరుగాక - అని స్వాహా శబ్దమునకు అర్థము.

మకారము మన వాగ్యంత్రము పలుకగలిగిన చివరి అక్షరము. మనముచేయు ప్రతి పనియును పూర్తి అయిన తరువాత ఫలితమనుభవించు మనస్సునకు సంబంధించినది.వేదమునందలి మకారమును మనస్సంబంధిగా చూడవలెను.

నాలిక మన మనస్సుయొక్క మొదటి బంటు. మనస్సులోని ఊహ బయటకు వచ్చుటకు నాలిక ముందడుగు వేయును. నాలిక కదపనిచో పలుకు లేదు. వట్టి అరుపులున్నవి. ఈ విషయము ఎవరికి వారు పరీక్ష చేసుకొనవచ్చును. అట్టి నాలిక తకారమును, సులభముగా, తేలికగా, ఆలస్యము లేకుండగ, పలుకుటకు వీలైన చోటునందు కూర్చొని ఉన్నది. తకారము పలుకుటకు నాలిక కొంచెము పైకి ఎత్తిన చాలును. నోటి పై భాగమును తాకి తకారము వెలికి వచ్చును. ఆ చోటు క, ఖ, గ, ఘ – చోటులవలె చిన్న చోటు కాదు. పెద్దచోటు. మనస్సు, పలుకుటకు వెతుకుకొన నక్కర లేదు. యథాలాపముగ కూడ "త"ను పలుకవచ్చును. కనుకనే పసిపిల్లలు అ, త, లను ముందు పలుకగలుగుట. చోటు పెద్దది. మనస్సునకు దగ్గరది. అందువలన, వేదము ఈ అక్షరమును మన యొక్క స్థితిని తెలుపుటకు ఉపయోగించినది. స్థితి యనగా మనము కూర్చుండు పీట. ఈ పీట ఒక్క భౌతిక శరీరము మాత్రము కూర్చుండుటకు వీలైన పీట కాదు. మన మనస్సు, మన జ్ఞానము, మన భౌతిక స్థితి, మూడును కూర్చొని ఉన్న పీట. ఈ పీటను మనము ఎంత పెద్దదిగా చేసికొనిన, అంత సుఖముగా ఉందుము. ఇరుకు పీట అయినచో మన బ్రతుకు ఇరుకుగా ఉండును. వేదమీ పీటను ప్రతిష్ఠ యనుచున్నది. కనుక ప్రతిష్ఠా మన్త్రముల యందు తకారములు ఎక్కువగా నుండును.

వేదమునందున్న దేవతా శక్తులనగా, మానవ శక్తుల కతీతమయి, మానవులు వాంఛించు శక్తులు. ఈ శక్తులు ఒక్కొక్కని యందు కొట్టవచ్చినట్లు కనపడుచున్నవి. ఒకడు మేధావి. పది యేండ్లకే పెద్ద పెద్ద లెక్కలు చేయు చున్నాడు. ఇంకొకడు చిన్న వయసులోనే పెద్దవారికి వలె సంగీతము పాడుచున్నాడు. ఇంకొకడు పెద్ద గ్రంథములు వ్రాసి రచయిత అని పేరు తెచ్చుకొనుచున్నాడు. మరియొకడు 110 ఏండ్లు బ్రతుకుచున్నాడు. ఈ విధముగా జన సామాన్యమునకు అందుబాటులో లేని శక్తులు, కొంత మందికి ఉన్నట్లు తెలియుచున్నది. వారివద్దకు పోయి, అయ్యా! ఈ శక్తులు మీకెట్లు కలిగినవి? అని అడిగినచో, వారికిని తెలియదు.

ఆ దేవతా శక్తులకు పక్షపాతము లేదు. వాటికి అందరు మానవులును సమానమే. వాటిని ఏ మానవుడైనను సాధింపవచ్చునని వేదము. ఆ విధానము తెలుపునదియే వేదము. వేదము అనగా తెలుపునది అని అర్థము.

సకారము దేవతాశక్తుల ప్రాణ శక్తిసూచకము. మకారము మనస్సంబంధి. హకారము మన ప్రాణమును సూచించునది. తకారము మనసకలమైన సుస్థితికి సంబంధించినది.

సంహిత యనగా దేవతా శక్తులను, మనస్సుద్వారా (పలుకు అక్షరము మనస్సంబంధి) మన ప్రాణ భాగమునందు జేర్చి, మన బ్రతుకుయొక్క స్థితిని పెంచునది. విస్తారము, విశాలము కలుగజేయునది. వేదసంహితలే మన దృక్పథమును, మన జీవన పద్ధతిని ఉత్తమ మార్గమునకు త్రిప్పగలిగినవి. వేదమునందు సంహితలు ప్రధానమైనవి. కనుకనే ప్రతివేదమును సంహితతో ఆరంభము.

ఇంత ప్రధానమైన సంహితా స్వరూపమెట్టిది? దాని ప్రధాన లక్షణములేమిటి? సంహితయనగా సంపుటి కనుక, వేదము వేటిని కలిపినది? ఎందుకు కలిపినది? ఈ సంహితా స్వరూపము, సృష్టిలో మరి ఏ పుస్తకమునందును చూడము. కనుక దీనిని గూర్చి విచారణ సేయవలయును.

1. అక్షరములను కలుపుట : వేదాక్షరములకు అర్థమున్నది గనుక, అక్షరములను కలిపి, కావలసిన అర్థమును స్ఫురింపజేయు శబ్దములనుకూర్చినది. ఉదాహరణమునకు పైన వివరించిన సంహితా శబ్దమునే చూడవచ్చును. ఇంకొక ఉదాహరణము. ఋతము, అనిన శబ్దము. ఋకారము మహాచైతన్యమయిన బ్రహ్మమును చెప్పును. తకారము స్థానము కదా! ఋతము అనగా బ్రహ్మముండు చోటు. బ్రహ్మమున్నదని మనకు తెలియు చోటు. సంస్కృత భాషలో ఋతము, సత్యము సమానార్థకములు. వేదమునందు ఋతము వేరు, సత్యము వేరు. "ఋతగ్ం, సత్యమ్ పరమ్ బ్రహ్మ పురుషమ్" అని వేదము. వేదమునందు వేరైన అక్షరములున్న శబ్దమునకు సమానార్థముండదు. వేదము శాస్త్రము. వేద శబ్దమునకు ఒక్కటే అర్థముండును. ఆ అర్థము, ఆ శబ్దమందలి అక్షరములవలన కలిగినది.

2. శబ్దములను కలుపుట : వేదము శబ్దములను కలుపును.

"అగ్ని మీళే పురోహితమ్". ఇది ఋగ్వేదమునందలి మొదటి ఋక్కులో మొదటి మూడు శబ్దములు. అగ్నిమ్, ఈళే, పురోహితమ్. సంహితలో అగ్నిమ్, ఈళే, రెంటిని కలిపి అగ్నిమీళే అని ఒకే పదమును చేసినది. అందువలన పురోహితమ్ రెండవ మాట. మొదటి రెంటిని ఎందుకు కలిపినది? వేదమే చెప్పవలెను కదా! ఆ ఋక్కునందే రెండవ పాదము చూచినచో సమాధానము తెలియును.

**అగ్నిమీళే పురోహితమ్**
**యజ్ఞస్య దేవమృత్విజమ్**
**హోతారం రత్నధాతమమ్**

రెండవ పాదమున మొదట యజ్ఞస్య అని ఉన్నది. అగ్నిని ఈళించుటయే యజ్ఞమని అర్థము. అగ్నిని వదలి మనము దేనిని ఈళించినను అది యజ్ఞము కాదు. వేదమారంభమునందే యజ్ఞమును తెలియజెప్పుచున్నది.

అగ్ని శబ్దమునకు అర్థము, ఈళ శబ్దమునకు అర్థము తెలిసినప్పుడు కదా, యజ్ఞము తెలియునది.

అగ్ని – అ–కారము మనకు యజ్ఞారంభమునందున్న శక్తి
గ–కారము మనయందున్న దేవతా శక్తుల గమనము
న–కారము మన జ్ఞానము
ఇ–యజ్ఞవేళ, వర్తమానకాలము

అగ్ని యనగా – మనకున్న సర్వశక్తులతో, దేవతా భావమును మన జ్ఞానమునందు పొందించు శక్తి. అగ్ని మనయందు పూర్వము లేని దేవతా భావములను (ఇదివరకు లేని అధికమైన ఊహలను) కల్పింపగలిగిన శక్తి. అది ఎక్కడ పని చేయును? మన జ్ఞానము మీద. ఎప్పుడు పనిచేయును? మనము యజ్ఞదీక్ష (determination) ను స్వీకరించినప్పుడు. ఆ దీక్షయే యజ్ఞము.

ఈళ : ఇ-కారము వర్తమానమును తెలుపును. ఈ – దీర్ఘము క్రియాకలాపమును సూచించును. అనగా ప్రయత్నము జరుగుచున్నదని సూచన. కాలము నిర్వ్యాపారముగా లేదని అర్థము.

ళ – ర, ల, ళ – లు వేదమునందు సమానాక్షరములు. కాని కొంచెము కొంచెము భేదముండును. రకారమైన జీవుడు అగ్నితో మేళవించినపుడు, తన జీవి భావమును మరచి, దేవతా భావమును స్వీకరించును. అపుడు జీవునకు ర-కు మారుగా వేదము ళ-ను వాడును. ళకారస్థితియనగా, అగ్నితో తాదాత్మ్యస్థితిని పొందుట.

ళే : ఆ అగ్ని భావముతో ఏకమైనట్లు చెప్పునది ఏది? ళకారమునకు ఇచ్చిన ఏకారము. అగ్నిలో నున్న అకారము, అప్పుడు జీవుడున్న వర్తమానస్థితిని సూచించు ఇకారముతో కలిసి ఏకారమయినది. ళకారమయిన జీవుడు, అగ్నిలోనున్న దేవతా శక్తిని భావించి, తన వర్తమాన ఇకార స్థితిని మరచి, ఏకార స్థితిని పొందినతడు. అగ్నిమీళే అనిన శబ్దమునందున్న జీవుడు యజ్ఞము సేయుచున్నాడు.

వేద సంహితాక్షరములు మహా శక్తిమంతములు. మనస్సును తపోమార్గమున (ఆలోచనామార్గమున) కొని పోవును. మొదటి అక్షరములను గురించి ఇంకను ఆలోచింపవచ్చును.

గ్ని : గకార, నకార, ఇకారములను కలిపి వేదము గ్ని – ని చేసినది. ఈ సంయుక్తాక్షరమునందు రెండు హల్లులు (గ్, న్), ఒక అచ్చు (ఇ) కలసి ఉన్నవి కదా! దేవతా శక్తిని తెచ్చి (గ), మన జానమునందు (న), యజ్ఞవేళ (ఇ) సమకూర్చుట – అని గ్ని-కి అర్థము. ఇది అక్షరసంహిత. సమకూర్చు శక్తి ఏది? అకారము.

అగ్ని: అ అను అక్షరము ఏ శక్తిని సూచించుచున్నదో , ఆ శక్తిని గ్ని తో కలుపునది అగ్ని. మన జ్ఞానమునకు, అప్పటికంటె ఉన్నతస్థితిని కల్పింపగలిగిన శక్తి అగ్ని. అది దేవతాశక్తి. ఎందుకనగా, మానవుడు తనకున్న శక్తితో జీవనము గడుపు ఇచ్ఛ గలవాడు గనుక. జీవన భృతికి చాలిన జ్ఞానముతో తృప్తినొందుట మానవ సహజమైన శక్తి. దానిని మించి సాధించవలెనను ఇచ్ఛలను కల్పించునవి; అట్టి ఇచ్ఛలకు ఉత్సాహము కల్పించునవి; ఇట్టి కోరికలను సాధించునవి దేవతాశక్తులు. ఆ యజ్ఞములను జరిపించు అగ్ని ముఖ్యమైన దేవతాశక్తి.

కనుక అ, గ్ని, లను కలిపి, వేదము అగ్ని యన్న శబ్దమును గూర్చినది. ఇది శబ్ద సంహిత.

వేద శబ్దములు రసాయన శాస్త్రమునందలి (chemistry) భిన్న పదార్థముల స్వరూపమును తెలియజేయు సంకేతనామముల(formulae) వంటివి. ఆ పదార్థముల కలయికను తెలియజేయు సంకేతసూత్రముల(technical rules) వంటివి. $H_2SO_4$ నందు $SO_4$ ను వేరు జేసినచో, మిగిలిన $H_2$ సల్ఫ్యూరిక్ యాసిడ్ కాదు. హైడ్రోజన్ మాత్రమే. "అగ్ని" శబ్దమునందు "గ్ని", ని తీసివేసినచో, మిగిలిన "అ" కును దేవతాశక్తిని సూచించదు. వేరైన అర్థవిచ్చును.

వేదశబ్దమైన అగ్నికి, మన కావ్యములందు చెప్పినట్లు వహ్ని, వీతిహోత్రుడు – నిప్పు వంటి అర్థములు చెప్ప రాదు. అగ్ని అగ్నియే. దాని యర్థము వేదమును చదివి తెలుసుకొనవలెను. ఆ శబ్దము ఉత్తమస్థితిని పొందుటకు చేయు యత్నమునందు (యజ్ఞమునందు) జీవిని అధికమైన మార్గమును పట్టించు అర్థవంతమైన అక్షరసంహిత. దానికి ఇంకొక అర్థము చెప్పినచో అచ్చటి మహామన్త్రము యొక్క ప్రయోజనమును గుర్తింపని వారమగుదుము. ఇతరులను తప్పు దారులు పట్టించిన వారమగుదుము. అందువలన, వేదమన్త్రములను (ఋక్కులను గాని, సామలను గాని, యజస్సులను గాని) యధేచ్ఛముగా అనువదింపరాదు. పద్యములు వ్రాసి, గణముల పూర్తి కొఱకు అగ్నికి నిప్పు, అశ్వమునకు గుఱ్ఱము, అను వేరైన శబ్దములను వాడరాదు.

సంహితములైన శబ్దములను తిరిగి సంహితము సేయుట : అగ్ని శబ్దము సంహితము, ఈళే కూడ సంహితమే. అగ్నిమీళే – వేదము సంహితములైన రెండు శబ్దములను తిరిగి సంహితము చేసి, యజ్ఞమనిన శబ్దమునకు అర్థము చెప్పుచున్నది. వేదము వేదశబ్దార్థములను తెలియజెప్పు విధానములలో ఇది ఒక విధానము. వేదమునందు వేదశబ్దముల కర్థములను మనము వెతుకు కొనవలెను. అనగా, ఆలోచింపవలెను. తపస్సు చేయవలెను. ఆ అర్థము మనస్సునకు పట్ట వలెను కదా! అందువలన వేదశబ్దార్థములు సంహితామయముగా నుండును. తపస్సు (ఆలోచన) వలననే ద్యోతమాన మగును.

ఇది ఒక్క అక్షర సంహితను గూర్చి మాత్రమే. వేదసంహిత యందు ఇంకను అనేకములైన సంహితలున్నవి. వాటిని వేరుగా విచారింపవలెను.

మనలో నున్న భావములు (ideas), అనుభూతులు (experiences), జ్ఞానగుళికలు (understandings and inferences), గుంపులు గుంపులుగా సంహితారూపములై బయటకు రావలెనన్న ఇచ్ఛతో (urge) వరుసగా మన ముంగిట నిలబడును. మనస్సు వాటిని అక్షరములుగా మార్చి వెలికి తెచ్చును. కొన్ని అక్షరములు కొన్ని భావపు గుంపులను తెలుపును. లోనున్న భావజ్ఞానసంహిత వాగ్యంత్రమునుండి అక్షరసంహితగా వెలికి వచ్చుచున్నది. ఇది సృష్టి యనిన అనేకమైన సంహితలలో ఒక ప్రధానమైన సంహితా రూపము. దీనికి వేదమిడిన పేరు అధివిద్య. ఇది జ్ఞానమును అక్షరముగా మార్పు పొందించు మహా సంహిత. వేదమీ మహాసంహితను విచిత్రముగా వాడినది. సృష్ఠ సమిష్టి రూపమును (సృష్టి సంహిత) అక్షరసంహితగా మార్చినది. మనస్సునకు లో నున్న జ్ఞానసంహితను అక్షర

సంహితగా మార్చు శక్తి ఉన్నదని మనకు తెలిసిన విషయము. దాని వలననే మనము బ్రతుకుట. వేదమేమనుచున్న దనగా, మనస్సునకు అక్షర సంహితను, జ్ఞాన సంహితగామార్చు శక్తికూడ ఉన్నదనుచున్నది.

ఆ శక్తితో వేదమునందున్న అక్షరసంహితను జ్ఞానసంహితగా, లోనున్న మన జ్ఞానమున కందసేయు విధానమును అధ్యయనము అను పేరుతో రూపొందించినది. మనలోనున్న అసంపూర్ణజ్ఞానమును సంపూర్ణము చేసుకొనుటకు, మన మనస్సునా మహాయజ్ఞమునందు నియమించుటకు వేదసంహితయే ఆధారము. మనస్సును ఆ యజ్ఞమునందు నియమించుటకు వేదమిడిన పేరు **శిక్షా.** ఆ శిక్షతో అధ్యయనము సేయుట శిక్షాధ్యాయనము. శిక్షాధ్యాయనము తైత్తిరీయోపనిషత్తునందు వివరింపబడినది.

సకలసృష్టి జ్ఞానస్వరూపమైన వేదసంహితకు, దాని వ్యాఖ్యానమైన ఉపనిషత్తునకును నమస్కారము.